క్లుప్తంగా

'పునరంకిత శోభాయాత్ర' రేపు



పుస్తకావిష్కరణలో కళాక్షేత్రం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : గీతా జయంతిని పురస్కరించుకుని సోమవారం అన్నమయ్య పునరంకిత శోభాయాత్ర నిర్వహించనున్నట్లు అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర్‌స్వామి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ముందుగా అందరికీ శ్రీహరే అంతరాత్మ పుస్తకం ఆవిష్కరించారు. కళాక్షేత్రం కార్యదర్శులు దేవానంద్, సంక్రాంతి వెంకటయ్య, సభ్యులు లక్ష్మణ్, రజని, మహేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రమణ్య షష్టి

పాకాల : ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో శనివారం భక్తి శ్రద్ధలతో షష్టి పూజలు నిర్వహించారు. కనులపండువగా కల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సొంపల్లి చంద్రశేఖర్, సర్పంచ్ గౌరీశంకర్ రాజు, ఈఓ యువరాణి పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే లక్ష్య సాధన

తిరుపతి సిటీ : క్రమశిక్షణతోనే విద్యార్థినులు లక్ష్యం సాధించవచ్చని మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులు కొలకలూరి మధుజ్యోతి తెలిపారు. శనివారం పద్మావతి మహిళా వర్సిటీలో నిర్వహించిన తెలుగు సాహితీ సమితి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మధుజ్యోతి మాట్లాడుతూ విద్యార్థినులు ప్రగతి పథంలో ముందుండాలని సూచించారు. అనంతరం రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన విద్యార్థినులు జి.మధుయామిని, ప్రత్యూషకు జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో సమితి సలహాదారు సుభాషిణి, యువశ్రీ, లక్ష్మీప్రియ, ప్రనూష, శిరీష, మోహిత పాల్గొన్నారు.

లింగ ఆధారిత హింస తగదు



ర్యాలీలో డీఎల్‌డీఓ నారాయణరెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర

తిరుపతి రూరల్ : లింగ ఆధారిత హింస తగదని, దీన్ని వందశాతం నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎల్‌డీఓ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారంలో భాగంగా శనివారం తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల పంచాయతీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ రామచంద్ర పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



సుభాషిణి మృతదేహం

తిరుపతి క్రైం : నగరంలోని వెస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. శశిధర్, సుభాషిణి(46)కి వివాహమై 20 ఏళ్లయ్యింది. వీరికి ఒక కూతురు. అమర్ రాజా ఫ్యాక్టరీలో శశిధర్ పని చేస్తున్నాడు. ఆయన భార్యకు కొంతకాలంగా మతిస్థిమితం లేదని తెలిసింది. ఈ క్రమంలో భర్త స్నానం చేస్తుండగా సుభాషిణి ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. ఆమె కేకలు విని పరుగున వచ్చిన భర్త హుటాహుటిన స్థానికుల సహాయంతో రుయా హాస్పిటల్ తీసుకెళ్లాడు. అయితే అప్పటికే సుభాషిణి మృతి చెందినట్లుగా డాక్టర్లు నిర్ధారించారు. మృతురాలి తమ్ముడు కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

16న 'పడమటి గాలి' ప్రదర్శన

తిరుపతి కల్చరల్ : తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన మహతి కళాక్షేత్రంలో సాయంత్రం 6 గంటలకు 'పడమటి గాలి' నాటకం ప్రదర్శించనున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాకం నాగరాజు, అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం మహతి సభా మందిరంలో నాటకం పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. సమితి ప్రధాన కార్యదర్శి ఎ.మల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షులు గంగవరం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సినీ నటులు

తిరుమల : తిరుమల శ్రీవారిని శనివారం పలువురు సినీ నటులు సేవించుకున్నారు. వీరిలో సుహాస్, కనకాల రోషన్, హర్ష ఉన్నాయి. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

తిరుపతి రూరల్: మండలంలోని పేరూరు పంచాయతీ జనార్ధన్ కాలనీలో ఇద్దరు మహిళలు అదృశ్యమైనట్లు శనివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు..నెల్లూరు జిల్లా, బిట్రగుంటకు చెందిన అనిత (21), కావలికి చెందిన శృతి (19) తమ భర్తలతో విభేదాలు రావడంతో తల్లులతో కలిసి ఇక్కడకు వచ్చి కూలి పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. శనివారం ఉదయం వారి తల్లులు పనికి వెళ్లి తిరిగి వచ్చి చూడగా అనిత, శృతి కనిపించలేదు. ఈ మేరకు ఆమె రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారు దగ్ధం

తిరుమల: తిరుమలలో కర్ణాటకకు చెందిన భక్తుల కారు శనివారం దగ్ధమైంది. వివరాలు.. బెంగళూరుకు చెందిన జె.భరత్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి కారులో తిరుమలకు వచ్చారు. బాలాజీ బస్టాండ్ వద్దకు రాగానే కారు ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపుచేశారు.

విద్యార్థులు, తల్లిదండ్రులతో కమిషనర్ మౌర్య తదితరులు



ఎస్‌వీఎస్ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు



ఉత్తమ భవితకు ఒక్క అడుగు

విద్యార్థుల ఉన్నత భవిష్యత్తే లక్ష్యంగా ప్రభుత్వం మెగా పేరెంట్–టీచర్స్ మీటింగ్‌కు శ్రీకారం చుట్టింది. అధికారులు సైతం ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించారు. సర్కారు బడుల్లో ఆ మేరకు అట్టహాసంగా ఏర్పాట్లు చేశారు. అయితే తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. దీంతో శనివారం చేపట్టిన సమావేశం తూతూమంత్రంగా సాగింది. అంతంతమాత్రంగానే హాజరుశాతం నమోదైంది.

- ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్–టీచర్స్ మీటింగ్
- అట్టహాసంగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- అంతంతమాత్రంగా హాజరైన తల్లిదండ్రులు



గోవిందరాజస్వామి పాఠశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం పేరెంట్–టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. అందులో భాగంగా తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో చేపట్టిన మెగా తల్లిదండ్రుల సమావేశానికి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఉత్తమ భవితకు ఒక్క అడుగు నినాదంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పిల్లలు అత్యుత్తమంగా ఎదిగేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. విలువలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ రెడ్డి, టీడీపీ నేత శ్రీధర్‌వర్మ, డీవైఈఓ కె.బాలాజీ, ఎంఈఓ భాస్కర్, ప్రధానోపాధ్యాయులు కదిరి రవి, భానుమతి, సీడీపీఓ సుధారాణి పాల్గొన్నారు.

తిరుపతి కల్చరల్: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో సహకారం అందించి పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు తోడ్పడాలని డీఎస్పీ శ్రీలత పిలుపు నిచ్చారు. టీటీడీ శ్రీగోవిందరాజస్వామి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.చంద్రయ్య ఆధ్వర్యంలో పేరెంట్–టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పిల్లలకు చక్కటి నడవడిక నేర్పి, వారి ఉన్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉయ్ సపోర్టు వ్యవస్థాపకులు తహసున్నీషా బేగం, విశ్రాంత హెచ్‌ఎం ఎం.నాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్ లత, మంజుల పాల్గొన్నారు.

చంద్రగిరి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శేఖర్, ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు, స్పెషల్ ఆఫీసర్ సాగర్, సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్‌ఐ అనిత, హెచ్‌ఎం వెంకటనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పాకాల : మండలంలోని 59 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ బాబ్జీ తెలిపారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం



తిరుచ్చిపై ఊరేగుతున్న శ్రీవారు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

ముగ్గురు విద్యార్థుల అదృశ్యం

తిరుపతి క్రైం: తిరుపతికి చెందిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులు అదృశ్యమైనట్లు తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎం.రవి శంకరాచారి(15), కె.పవన్(15), టి.రానా ప్రతాప్(15) ముగ్గురూ టాటానగర్‌లోని ప్రశాంతి స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. శనివారం మధ్యాహ్నం వీరు బ్యాగులతో సహా బయటకు వచ్చి రైల్వేస్టేషన్ వద్దకు చేరుకున్నారు. వీరిలో రవిశంకరాచారి తన తల్లికి ఫోన్ చేసి వెళ్లిపోతున్నామని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో వారి తల్లిదండ్రులు రైల్వే స్టేషన్ పరిసరాల్లో వెతికి చూశారు. అయితే వారు ఎక్కడా కనిపించకపోవడంతో ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 9440796748కు తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించం



మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో తిరుపతి రూరల్ మండలం సర్పంచ్‌లు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకుంటే సహించే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయనను తిరుపతి రూరల్ మండలం లింగేశ్వరనగర్, సాయినగర్, కేసీపేట, అవిలాల, బ్రాహ్మణపట్టు, పద్మావతీపురం పంచాయతీల సర్పంచ్‌లు కలిశారు. నిధులు ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు చేపట్టలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.50 వేలకు మించి అభివృద్ధి పనులకు వెచ్చించాలంటే ఎమ్మెల్యే నాని, ఎంపీడీఓ అనుమతి తీసుకోవాలని కార్యదర్శులు తెగేసి చెబుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన పనులు తప్ప, ఒక్కటి కూడా చేపట్టలేదని వెల్లడించారు. దీనిపై చెవిరెడ్డి స్పందించారు. అభివృద్ధికి సహకరించకుంటే ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ప్రజల ఎదుట అధికారులను దోషులుగా నిలబెడదామని స్పష్టం చేశారు. సర్పంచ్‌లతో కలిసి పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

డ్రోన్‌తో దోమల మందు పిచికారీ



డ్రోన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో దోమల లార్వా నాశనం చేసేందుకు డ్రోన్‌ల ద్వారా మందు పిచికారీ చేయిస్తున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. శనివారం నారాయణపురంలో డ్రోన్‌తో మందు పిచికారీని ఆమె పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ దోమల వ్యాప్తి నివారణకు మందులను స్ప్రే చేస్తున్నామని, మనుషులు వెళ్లలేని ప్రాంతాలకు డ్రోన్లు వినియోగిస్తున్నామని వివరించారు. నిత్యం కనీసం 20 ఎకరాల పరిధిలో ఈ మందులు చల్లే కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ అజయ్ పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్‌కు డిమాండ్



వీసీకి వినతి పత్రం అందిస్తునన కాంగ్రెస్ నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ప్రొఫెసర్ చెంగయ్య పై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహ, నగర అధ్యక్షుడు గౌడ పేరు చిట్టిబాబు, ఎస్సీ సెల్ చైర్మన్ శివ శంకర్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున, నేతలు స్వరూప నాయక్, నరేంద్ర, అనిల్, కుమార్, అశోక్, మోహన్ పాల్గొన్నారు.

బోరును సీజ్ చేస్తారని విషం తాగిన మహిళ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

పాకాల: తమ ఆధీనంలో ఉన్న బోరును సీజ్ చేస్తారని మహిళ పురుగుల మందు తాగిన సంఘటన మండలంలోని పెద్దమ్మగారిపల్లెలో చోటు చేసుకుంది. శనివారం స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు కథనం మేరకు.. పెద్దమ్మగారిపల్లెకు చెందిన ఎస్.ఈశ్వరి(55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేది. తమ పొలంలో బోరు వేసుకుని సుమారు 25 ఏళ్లుగా వ్యవసాయం చేస్తోంది. గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు టీడీపీ నాయకుల సహకారంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి కక్షగట్టి బోరును సీజ్ చేసేందుకు యత్నిస్తున్నారని ఈశ్వరి కుటుంబ సభ్యులు వాపోయారు. రెవెన్యూ అధికారులు బోరును సీజ్ చేస్తామని నోటీసులు జారీ చేసిన తరువాత కోర్టుకు కూడా వెళ్లామని విన్నవించారు. రెవెన్యూ అధికారులు శనివారం బోరును సీజ్ చేయడానికి పొలం వద్దకు రావడంతో తీవ్ర మనస్తాపానికి చెందిన ఈశ్వరి పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు పూతలపట్టు మండలం, పి.కొత్తకోటలోని సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు ఆమె పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. ఈ విషయంపై వీఆర్వో కృష్ణపిళ్లైని వివరణ కోరగా బోరు వేసిన స్థలం ప్రభుత్వ స్థలంలో ఉందని, స్థానిక గ్రామస్తులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారని, భూమిని సర్వే చేసి బోరు ప్రభుత్వ స్థలంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారని పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్ నిత్యానందబాబు సదరు బోరును సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. సీజ్ చేయడానికి పొలం వద్ద వెళ్లామని, ఈ ఘటన జరగడంతో బోరును సీజ్ చేయలేదని వీఆర్వో పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి : ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. శనివారం ముంగళిపట్టు పంచాయతీలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 33 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పంచాయతీ పరిధిలో మొత్తం 143 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శివరామసుబ్బయ్య తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ శేఖర్ పాల్గొన్నారు.

పుదిపట్లలో..

తిరుపతి రూరల్ : మండలంలోని పుదిపట్లలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ బడి సుధాయాదవ్ అధ్యక్షత వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. అభివృద్ధి పనులకు రూ.1.70 కోట్లు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు. తహసీల్దార్ రామాంజనేయులునాయక్ పాల్గొన్నారు.

రూ.72 లక్షలతో ట్రాక్టర్లు

స్వచ్ఛభారత్ నిధులు రూ.72 లక్షలతో కొనుగోలు చేసిన 16 ట్రాక్టర్లను మండలంలోని 16 పంచాయతీలకు ఎమ్మెల్యే నాని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ట్రాక్టర్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఎంపీడీఓ రామచంద్ర పాల్గొన్నారు.

గ్రంథాలయాల అనుసంధానం అవసరం



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభిస్తున్న వీసీలు, అతిథులు

తిరుపతి సిటీ: సాంకేతికతను వినియోగించుకుని దేశంలోని అన్ని గ్రంథాలయాలను అనుసంధానించి ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని వీసీ సీహెచ్ అప్పారావు అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో సెనేట్ హాల్‌లో రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ సదస్సును శనివారం ఆయన ద్రావిడ వర్సిటీ వీసీ, ముఖ్యఅతిథులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. టెక్నాలజీ, ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఫర్ అకడమిక్ అండ్ పబ్లిక్ లైబ్రరీ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో వీసీ మాట్లాడుతూ దేశంలోని అన్ని గ్రంథాలయాల్లో ఉన్న డేటాను టెక్నాలజీ ద్వారా అనుసంధానించాలని కోరారు. దీంతో ప్రజలందరూ విజ్ఞానవంతులు కావడానికి అవకాశం ఉందని చెప్పారు. ఎస్వీ యూనివర్సిటీకి ప్రధాన గ్రంథాలయం తలమానికంగా ఉందని కొనియాడారు. గ్రంథాలయం నిర్వహణ, ప్రగతి, అభివృద్ధి చేయడంలోనూ యూనివర్సిటీ లైబ్రరీ డైరెక్టర్ సురేంద్ర బాబు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ద్రావిడ వర్సిటీ వీసీ డాక్టర్ దొరస్వామి మాట్లాడుతూ లైబ్రరీలపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు, సామాన్య ప్రజలు, పరిశోధకులు, అధ్యాపకులు అందరికీ ఉపయోగపడే రీతిలో లైబ్రరీలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం టెక్నాలజీ పాత్ర కీలకంగా ఉంటుందని చెప్పారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో టెక్నాలజీ వినియోగం మరింతగా పెరగాలని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామన్నారు. డీఆర్డీఓ డాక్యుమెంటేషన్ విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు, ఇండియన్ స్టాటిస్టికల్ సెంటర్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్ర బాబు, ఇన్ ఫ్లిబ్ నెట్ డైరెక్టర్ దేవికా మదల్లి, కిషోర్ పాల్గొన్నారు.

కాలు జారితే.. కథ కంచికే!



అగ్నిమాపక కార్యాలయం ఎదుట నీరు పడకుండా పెట్టిన డస్ట్‌బిన్‌లు

- చినుకు పడితే చిత్తడిగా కలెక్టరేట్ భవనం
- పై భాగంలో అమర్చిన రేకుల పగుళ్లే కారణం
- నడిచేందుకు అవస్థలు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు
- సమస్యను పట్టించుకోని అధికారులు

జిల్లా పరిపాలనకు కలెక్టర్ కార్యాలయమే కేంద్రబిందువు. ఇక్కడి నుంచే ఉన్నతాధికారులు కార్యకలాపాలు సాగిస్తుంటారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అడుగులు వేస్తుంటారు. అత్యంత కీలకమైన కలెక్టరేట్‌లోనే సిబ్బందికి.. సందర్శకులకు ఇక్కట్లు తప్పడం లేదు. చినుకు పడితే భవనంలోకి వర్షపు నీరు చేరుతోంది. పలు ఆఫీసుల ఎదుట నిల్వ చేరి పాకుడు పడుతోంది. ప్రతిష్టాత్మక బిల్డింగ్ పైభాగంలో ఏర్పాటు చేసిన రేకులకు పగుళ్లు రావడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని ఉద్యోగులు వెల్లడిస్తున్నారు. పట్టించుకునే వారు లేకపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారిందని వివరిస్తున్నారు. ఏమాత్రం కాలు జారినా తీవ్రమైన గాయాలపాలయ్యే ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి అర్బన్ : తిరుపతి కలెక్టరేట్ పై భాగంలోని రేకులకు నెల క్రితం పగుళ్లు వచ్చాయి. దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా చాలు కార్యాలయాల ముందు భాగంలో నీళ్లు చేరిపోతున్నాయి. అయితే ఫ్లోర్ టెయిల్స్ మీద నీరు కనిపించడం లేదు. ఈ క్రమంలో ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు తరచూ జారి పడిపోతున్నారు. ఇటీవల అగ్నిమాపక కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు పడిపోయి గాయాలపాలయ్యారు.

మరమ్మతు అవసరం

కలెక్టరేట్‌లో ఏ బ్లాక్, బీ బ్లాక్ పేరుతో భవనాలు ఉన్నాయి. ఒక్కో బ్లాక్‌లో ఏడు అంతస్తులు ఉన్నాయి. వీటిపై భాగంలో ప్లాస్టిక్ రేకులు ఏర్పాటు చేశారు. వాటికి పగుళ్లు రావడంతో సమస్య మొదలైంది. ముఖ్యంగా మూడో అంతస్తులోని అగ్నిమాపక, హౌసింగ్, డీఈఓ తదితర కార్యాలయ ముందు భాగాల్లో నీరు నిల్వ చేరుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో నడిచేవారు జారి పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఏ బ్లాక్‌తో పాటు, బీ బ్లాక్ పై భాగంలో మరమ్మతు చేయించాల్సిన అవసరముంది. కలెక్టరేట్‌కు ఉద్యోగులతోపాటు నిత్యం దాదాపు 200 మంది వివిధ సమస్యలపై వస్తుంటారు. ఇక గ్రీవెన్స్ రోజున అయితే అర్జీదారుల సంఖ్య వెయ్యికి పైగానే ఉంటోంది. ఈ క్రమంలో త్వరితగతిన అధికారులు చర్యలు చేపట్టాలని ఉద్యోగులు, సందర్శకులు విన్నవిస్తున్నారు.





కలెక్టరేట్ భవనం పై భాగంలోని రేకులు, గృహనిర్మాణ శాఖ కార్యాలయం ముందు భాగంలో నిలిచిన నీరు